## 6-54

### మున్నుడి

పరమాత్ముని సేవించుటకు పలుదార్లున్నా నవవిధ భక్తి జగత్ప్ర సిద్ధమైనది. అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో ఆ నవ విధ భక్తి వలన కలిగే మేళ్ళను వివరిస్తున్నారు, తనశైలిలో. ఏ సుఖమైనా కొంత కాలపరిమితి వుండేదే. ఒక్క జనార్దనుని సేవవల్ల కలిగే సౌఖ్యమే కాలపరిమితిలేని సంతతసౌఖ్యము అని అంటున్నారు. పైగా ఈ సౌఖ్యముతో పాటు ముక్తి కూడా లభిస్తుంది. ఇక ఇంతకంటే గొప్పది ఇంకొకటేమివుంటుంది అంటున్నారు. శ్రీవేంకటోత్తముని కొలువు కంటే వుత్తమైనది లేదంటున్నారు.

**చం॥ ఘనమికలేదు శ్రీహరిని గట్టిగ నమ్ముచు సేవచేయుడీ**
**వనజభవాది దేవగణవందితు శౌరిని ఆ జనార్దనున్**
**చనువున కొల్వుడీ అదియె సంతతసౌఖ్యము అన్నమయ్యనెన్**
**తను గొని వేంకటోత్తముని దాస్యము జేసెను కీర్తినెంచుచున్.**

**రాగం : సువటి**

ఇంతకంటే ఘనమికలేదు
సంతత సౌఖ్యము జనార్దనుడే ॥ఇంత॥

భయనివారణము పరమాత్ముని నుతి
జయకారణము ఈశ్వర చింత
అయుత పుణ్యఫల మచ్యుతుని సేవ
క్రియతో నిజమెరిగిన వారికిని ॥ఇంత॥

కర్మహరము శ్రీకాంతుదరిశనము
ధర్మరాసి మాధవు శరణు
ఆర్మిలి సంపద లనంతుని తగులు
నిర్మలముగ పూనిన దాసులకు ॥ఇంత॥



(1)

28.02.2020



ఆగమోక్త మీ హరి కైంకర్యము
భోగము విష్ణుని పూజయిది
యోగము శ్రీ వేంకటోత్తముని కొలువు
బాగులు నేర్చిన ప్రపన్నులకును ॥ఇంత॥

**భావామృతం :**

ఓ మానవులారా! జనార్దనుడే పరమాత్ముడు. ఆయనను సేవించుట, సర్వకాల సర్వావస్థలయందు సౌఖ్యప్రదము. ఇంతకంటే ఘనమైనది మరి ఇంకొకటి లేదు.

ఆ పరమాత్ముని నుతించుట వలన భయము నివారణమగును. ఈశ్వరుడైన ఆయన చింత (ఆలోచన) ఎప్పుడూ జయమునకు హేతువైయున్నది. అచ్యుతుని సేవ ఆయుత (సిద్ధించిన) పుణ్యఫలము. క్రియతో (పూనుకొని) నిజము తెలుసుకొన్నవారికి ఈ సత్ఫలితములు తప్పక కలుగుతాయి.

శ్రీకాంతుని దర్శనమాత్రము చేతనే పూర్వ, ప్రస్తుత కర్మలఫలము నశిస్తుంది. మాధవుని శరణాగతి అత్యుత్తమ ధర్మము. అనంతుని పై తగులు (ఆసక్తి) ఆర్మిలి సంపద (అతిశయించిన సిరి). నిర్మలులై పూనికతో ఆ దామోదరుని దాసులైనవారికి ఇవియన్నియు సంప్రాప్తిస్తాయి. సార్ధకతనిచ్చేది శౌరి శరణాగతి మాత్రమే.

శ్రీహరికి కైంకర్యము (ఊడిగము) చేసై అది వేదవిదితమే. విష్ణుదేవునికి చేసే పూజ దివ్యవైభోగములను పలు భోగభాగ్యములను ప్రసాదిస్తుంది. శ్రీ వేంకటగిరిపైనున్న ఆ పురుషోత్తముని కొలువులభించవలెనంటే అది గొప్పయోగము. ఇందుకు సందేహం లేదు. ప్రపన్నులై (భక్తితో శరణాగతులై) బాగులు నేర్చిన వారికి "(యుక్తాయుక్త విచక్షణ నెరిగిన వారికి)" సర్వమూ సిద్ధిస్తుంది అని గ్రహించండి.



Scanned with CamScanner

**3-61**

## మున్నుడి

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు వైద్యునిగా మారి, మన 'రోగం' కుదర్చటానికి మంచి మందేదో సెలవిస్తున్నారు. మనిషి నాగరికుడైన దగ్గరనుంచి ఎన్నో వ్యాధులు వాణ్ణి పట్టి పీడిస్తున్నాయి. మనశ్శాంతిలోపం, బంధుప్రీతి, భవబంధాలు, పాపకర్మలు చేయటం, దైవ విముఖత వంటి విచిత్రమైన రోగాలు ఈ మానవుణ్ణి పీడిస్తున్నాయి. పదునాల్గు భువనాలలోను ఈ రోగాలకి మందులిచ్చే వైద్యుడు కనపడటంలేదు. మన సుకృతం కొద్దీ అన్నమాచార్యులవారు కలిశారు. విచారించకండి వీటన్నిటికీ ఒక్కటే మందు వుందన్నారు. ఒక్క 'పైస' కూడ పారితోషికం తీసికోని ఆయన మందు సేవించండి...

కం॥ అన్నిటి కౌషధమిదియే
వెన్నుని నామంబె మీకు విమలౌషధమౌ
సన్నుతిజేయుచు గొనుడిది
అన్నయ్యను వినుడు నేడె హరి దిక్కనుడీ.

**రాగం : మోహన కళ్యాణి**

అన్నిటికి నిది పరమౌషధము
వెన్నుని నామమే విమలౌషధము ॥అన్నిటికి॥

చిత్త శాంతికిని శ్రీపతి నామమె
హత్తిన నిజ దివ్యౌషధము
మెత్తపు బంధ విమోచనంబునకు
చిత్తజగురుడే సిద్ధౌషధము ॥అన్నిటికి॥

పరిపరి విధముల భవరోగములకు
హరిపాదజలమె ఔషధము
దురిత కర్మముల తొలగించుటకు
మురహరి పూజే ముఖ్యౌషధము ॥అన్నిటికి॥



28.02.2020



యిల నిహపరముల ఇందిరా విభుని
అలరి భజింపుటె ఔషధము
కలిగిన శ్రీవేంకటపతి శరణమే
నిలిచిన మాకిది నిత్యౌషధము ॥అన్నిటికి॥

**భావామృతం :**

ఓ ప్రజలారా! మీ వ్యాధులన్నిటికీ ఇది పరమౌషధం. (దీన్ని మించినది లేదు). విష్ణుదేవుని నామ సంకీర్తనే శుద్ధమైన ఔషధము అని గ్రహించండి.

తరచుగా మీ అందరూ 'మనశ్శాంతి' కఱువయిందని వాపోతుంటారు. కోటీశ్వరుడైనా, కూటికి లేని వాడైనా ఇదే వ్యాధితో సతమతమవుతున్నాడు. దీనికి 'హత్తిన' (కలిగిన) దివ్యౌషధం వున్నది. అదే లక్ష్మీకాంతుని నామసంకర్తన. 'హరి హరి' అంటే చాలు (ఉత్తిగా నోటితో అంటే చాలదు మనస్పుతో అనాలి మరి). ఇంకొక ఘోరమైన వ్యాధి వున్నది. దానిపేరు 'బంధుప్రీతి'. మొత్తం బంధు వ్యామోహం నుండి విముక్తి లభించాలంటే ఒక గొప్ప సిద్ధౌషధమున్నది. అదే చిత్తజ గురుని (మన్మధుని తండ్రియైన మాధవుని) ఆశ్రయించుట, అని తెలిసికొనండి.

రకరకములైన వ్యాధులు భవము (పుట్టుక) చేత ప్రాప్తిస్తుంటాయి. (అవి మన పూర్వజన్మలలోని అకృత్యాలకు ఫలితంగా ఈ జన్మలో మనం అనుభవించటానికి కలుగుతుంటాయి. ఇప్పుడు మన చేతుల్లో ఏమీలేదు). దీనికి కూడా ఒకమంచి ఔషధం వున్నది. అదే శ్రీహరి పాదోదకం. శ్రీహరిని పూజించి అభిషేకం చేస్తే ఆయన పాదప్రక్షాళన తరువాత ఆ జలమును స్వీకరించండి. భవరోగం రూపుమాసిపోతుంది. మనం చేసిన పాతపాపాలే కాక ఈ జన్మలోనూ ఎన్నో చెడు కర్మలు చేస్తూనే వున్నాం కదా! ఇవి పోవాలంటే ఏం చేయాలి? మురహరి అన్ని కీర్తించబడే శ్రీమన్నారాయణుని పూజించండి. అది అతి ముఖ్యమైన ఔషధం.

ఈ ప్రపంచంలో ఇహ పరములు రెండింటికీ ఒక్కటే మందు వున్నది. అదే ఇందిరావల్లభుని భజన. ప్రీతితో ఆయనను భజించండి. ఈ ఏడుకొండల మీద ఈ దివ్యక్షేత్రంలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరుని శరణాగతి ఒక్కటే మాకు ప్రతిదినమూ తీసికోవలసిన ఔషధమై నిలిచియున్నది.



Scanned with CamScanner